క్లుప్తంగా

అత్యవసర నంబర్లపై అవగాహన అవసరం

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థినులకు అత్యవసర నంబర్లపై అవగాహన ముఖ్యమని మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ నాగసౌజన్య అన్నారు. నగరంలోని ప్రైవేట్ పాఠశాలలో శుక్రవారం శక్తి యాప్ వినియోగం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ శక్తి యాప్, బాల్య వివాహాలు, అత్యవసర నంబర్లపై విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. మహిళల భద్రతకు ప్రభుత్వం శక్తి యాప్‌ను ప్రారంభించిందని చెప్పారు. ఈ యాప్ అత్యవసర సమయంలో ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నప్పుడు యాప్‌ను వినియోగించి పోలీసులకు సత్వరం సమాచారం చేరవేయవచ్చన్నారు. మన భద్రత మన చేతుల్లోనే ఉంటుందన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగితే వెంటనే 1098కు సమాచారం ఇవ్వాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేసి సహాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసులు పాల్గొన్నారు.

నటరాజస్వామి చిద్విలాసం



చిత్తూరు నగరంలోని శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం పంగుణి బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా సాగాయి. ఉదయం స్వామి వారికి అభిషేక పూజలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ఉత్సవమూర్తిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. అగస్త్యేశ్వర స్వామివారు నటరాజస్వామిగా చిద్విలాసం చిందించారు. రాత్రి కైలాసగిరి రావణ వాహనంపై విహరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

- కాణిపాకం

పంట నేలమట్టం

గుడిపాల మండలంలోని అడవిచేను, పాపసముద్రం, పిళ్లారికుప్పం, గుడిపాల ప్రాంతాల్లో గురువారం రాత్రి కురిసిన వర్షం, గాలి తాకిడికి వరిపంట నేలమట్టమైంది. ఉన్నట్టుండి ఈదురు గాలి వీయడంతో సుమారు 250 ఎకరాల వరి పంట పూర్తిగా నేలకొరిగింది. పంట చేతికి వస్తున్న సమయంలో ఇలా జరగడంపై రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పంటకు సంబంధించి నష్టపరిహారం అందించాలని రైతన్నలు డిమాండ్ చేస్తున్నారు.

- గుడిపాల



పార్టీ బలోపేతానికి కృషిచేయండి



నాయకులతో మాట్లాడుతున్న విజయానందరెడ్డి

గుడిపాల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చిత్తూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి తెలిపారు. మండలంలోని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులకు కొత్తగా పదవులు రావడంతో వారితో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరినీ కలుపుకొని కూటమి నాయకులు అరాచకాలను ఎండగట్టాలని సూచించారు. గ్రామాల్లో పార్టీ కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా తాను ముందుంటానన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని చెప్పారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి



వృద్ధులను పరీక్షిస్తున్న డాక్టర్ ప్రియాంక

తవణంపల్లె: ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని డాక్టర్ ప్రియాంక తెలిపారు. మండలంలోని దిగువతడకరలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ప్రియాంక 37 మందికి వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. వేసవిలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడంతో ప్రజలు బయట తిరగకుండా, వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. గ్రామాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా చూసుకోవాలని చెప్పారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే పాటించాలన్నారు. ఉప్పొంకలో డాక్టర్ మోహన్ వేలు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా రోగులకు పరీక్షించి వైద్య సేవలందించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తాటి ముంజలు వచ్చేశాయ్

- వేసవి తాపానికి ఉపశమనం
- ఆరోగ్యానికి మంచి ఔషధం
- గ్రామాల్లోనూ పెరుగుతున్న డిమాండ్

బంగారుపాళెం: మండే ఎండలు, ఉక్కపోతతో ప్రజలు అల్లాడుతున్నారు. ఈ వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడానికి పండ్ల రసాలు, కర్బూజా కాయలతో పాటు తాటిముంజలపై మక్కువ చూపుతున్నారు. మండల కేంద్రంలో తాటి ముంజల కొనుగోలుకు ప్రజలు పెద్ద ఎత్తున ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో విక్రయాలు జోరందుకుంటున్నాయి. తాటిముంజలు డజను రూ.80 నుంచి 100 రూపాయల వరకు విక్రయిస్తున్నారు. దాహార్తిని తీర్చడంతోపాటు శరీరానికి చల్లదనాన్ని అందించడం, ఆరోగ్యానికి మేలు చేసే పోషకాలు మెండుగా ఉండడంతో తాటి ముంజలను ఐస్ యాపిల్‌గా పిలుస్తారు. తాటికాయలను చూసిన వారు వాటి ముంజలను తప్పనిసరిగా కొనుక్కుని వెళ్తున్నారు. ఈ మండలంలో పెద్దగా తాటిచెట్లు లేకపోవడంతో వ్యాపారులు తవణంపల్లె, యాదమరి, మండలాల నుంచి తాటికాయలను తీసుకువచ్చి ఇక్కడ ముంజలను విక్రయిస్తున్నారు. తాటి ముంజల్లో పోషకాలు, విటమిన్లు అధిక శాతంలో ఉంటాయని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శిరీష తెలిపారు. వంద గ్రాముల తాటిముంజలో 43 కేలరీల శక్తి ఉంటుందన్నారు.





బంగారుపాళెంలో విక్రయానికి తీసుకువచ్చిన తాటికాయలు (ఇన్‌సెట్) తాటిముంజలు

విటమిన్ ఏ,బీ,సీ సమృద్ధిగా ఉంటాయని చెప్పారు. తాటి ముంజలు తినడం వల్ల అధిక శాతం నీరు ఉండి దాహార్తిని తీర్చడంతో పాటు శరీరానికి చల్లదనాన్ని ఇస్తుందన్నారు. ఐరన్, జింక్, ఫాస్పరస్, కాల్షియం వంటి పోషకాలు మెండుగా ఉంటాయన్నారు. లేత తాటి ముంజలు తినాలని సూచించారు. లేత కొబ్బరిని పోలి ఉండడంతో ప్రతి ఒక్కరూ ఇష్ట పడతారన్నారు.

గజరాజుపై సీతారాముల విహారం

తవణంపల్లె: మండలంలోని అరగొండ శ్రీ కోదండ రామస్వామి దేవస్థానంలో శుక్రవారం రాత్రి గజవాహన సేవను భక్తిప్రపత్తులతో వైభవంగా నిర్వహించారు. ఉదయం సీతారామలక్ష్మణులకు అర్చకులు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి ఉభయదారులచే ఐరావతి వాహన సేవను వైభవంగా నిర్వహించారు. అర్చకులు ఉత్సవమూర్తులు సీతారామలక్ష్మణులకు అభిషేకం, పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. విద్యుద్దీపాలంకరణ, సుగంధపరిమళ పుష్పాలతో అలంకరించి గజవాహనంపై సీతా సమేత శ్రీరాముడు కొలువుదీరి భక్తులకు కనువిందు చేస్తూ మాడవీధుల్లో విహరించారు. భక్తులు ఇంటింటా కొబ్బరికాయలు కొట్టి, మంగళ, కర్పూర హారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు సీతారాముల కల్యాణం

అరగొండ శ్రీ కోదండరాముల దేవస్థానంలో శనివారం ఉదయం సీతారామలక్ష్మణులకు అభిషేకం, పూజలు నిర్వహించనున్నారు. 11 గంటలకు సీతారాముల కల్యాణోత్సవం, మధ్యాహ్నం 3 గంటలకు రథోత్సవం వైభవంగా సాగుతోందని కార్య నిర్వాహకులు తెలిపారు.



గజవాహనంపై విహరిస్తున్న శ్రీరామచంద్రుడు

బండపల్లిలో మహిళ ఆత్మహత్య

పూతలపట్టు (కాణిపాకం): కుటుంబ కలహాలతో మహిళ ఇంట్లోనే ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు, తవణంపల్లి మండలం అరగొండ గ్రామానికి చెందిన హైమా(28) పూతలపట్టు మండలం బండపల్లెకు చెందిన హరిబాబుకు 4 ఏళ్ల కిందట వివాహమైంది. ఈ దంపతులకు మూడేళ్ల కుమార్తె కూడా ఉంది. కుటుంబలో తరచూ గొడవల కారణంగా గురువారం అర్ధరాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. హైమా తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు భర్తతోపాటు అతని తల్లిపై పూతలపట్టు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తల్లీబిడ్డ క్షేమం.. పోషణ్ పఖ్వాడ లక్ష్యం



189కొత్తపల్లెలో పౌష్టికాహార వారోత్సవంలో పాల్గొన్న సీడీపీవో



మరకాలకుప్పంలో గర్భిణులకు సీమంతం చేస్తున్న అంగన్‌వాడీలు

గుడిపాల: తల్లీ బిడ్డ క్షేమమే పోషణ్ పఖ్వాడా లక్ష్యమని, పోషణ్ పఖ్వాడాపై గర్భిణీలకు అవగాహన కల్పించాలని సీడీపీవో శ్యామ్ సుగుణకుమారి పేర్కొన్నారు. శుక్రవారం 189కొత్తపల్లె, మరకాలకుప్పం పంచాయతీల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిగిన పోషణ్ పఖ్వాడా కార్యక్రమంలో పాల్గొన్నారు. గర్భిణీ దశ నుంచి వారు ప్రసవించిన రెండేళ్ల వరకు తల్లీ బిడ్డల ఆరోగ్య స్థితిని మెరుగు పరిచే విధంగా వెయ్యిరోజుల పాటు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గర్భిణీ దశలో పౌష్టికాహారం అందించడం వల్ల బిడ్డ పెరుగుదల వేగవంతంగా ఉంటుందన్నారు. రక్తహీనత నివారణకు మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బరువు తక్కువగా ఉండే వారిని గుర్తించి ఎస్ఆర్‌సీకి పంపాలని అంగన్‌వాడీలకు సూచించారు. అనంతరం గర్భిణులకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు తోయాద్రాక్షి, స్వర్ణలత, అంగన్‌వాడీ టీచర్లు రాణి, గౌరి, నిర్మల, ఇందిర, అన్నెమ్మ, కోకిల, మంజుల, రోసీలీ, వాసంతి, రేఖ తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి రోజుల సంరక్షణపై అవగాహన ఉండాలి

తవణంపల్లె: గర్భం నుంచి బిడ్డ పుట్టి రెండేళ్ల వరకు జరిగే వెయ్యి రోజుల సంరక్షణపై ప్రతి తల్లి, కుటుంబసభ్యులు అవగాహన కలిగి ఉండాలని ఐరాల సీడీపీఓ నిర్మల తెలిపారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని పైపల్లె, పట్నం దళితవాడ, కృష్ణాపురం, ఎడమలవారిపల్లె అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్‌పఖ్వాడ కార్యక్రమం నిర్వహించారు. పైపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీఓ నిర్మల మాట్లాడుతూ తల్లిగర్భం నుంచి బిడ్డ పుట్టి రెండేళ్ల వరకు వెయ్యి రోజుల్లో బిడ్డకు 85 శాతం బ్రెయిన్ వృద్ధి చెందుతుందని వివరించారు. పిల్లల్లో వయసుకు తగ్గ ఎత్తు, బరువు ఉండాలని సూచించారు. తక్కువ బరువు, ఎత్తు ఉన్న పిల్లలకు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న పిల్లల శాతం పెరుగుతోందని తెలిపారు. దీనికి మొదటి కారణం బయటి ఆహార పదార్థాలు తినిపించరాదని, ఇంటి వద్దనే తయారు చేసిన ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, బాలామృతం పిల్లలకు రోజుకు వంద గ్రాములు క్రమం తప్పకుండా తినిపించాలని వివరించారు. దీంతోపాటు చిరుధాన్యాలు పెట్టడం వల్ల బిడ్డకు లోపపోషణ లేకుండా వయసుకు తగిన బరువు, ఎత్తు ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మహిళా పోలీసులు, టోటల్ హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.



పైపల్లెలో పోషణ్ పఖ్వాడ కార్యక్రమంలో పాల్గొన్న గర్భిణులు, బాలింతలు, చిన్నారులు

అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే

చిత్తూరు కలెక్టరేట్ : అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిబా పూలే అని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. జిల్లా కేంద్రంలోని పీసీఆర్ సర్కిల్ వద్ద ఉన్న మహాత్మ జ్యోతిబా పూలే విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆడపిల్లల చదువు కోసం తన జీవితాన్ని అంకితం చేశాడన్నారు. సత్యశోధక సమాజంలో నిరుపేదలకు వివాహాలు జరిపించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి మునీంద్రయ్య, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి పాల్గొన్నారు. అనంతరం ఏపీసీసీ మాజీ కార్యదర్శి పరదేశ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణ, జ్యోతిబాపూలే అవార్డు గ్రహీత, పోలవరం నియోజకవర్గం కో–ఆర్డినేటర్ బండి విజయభాస్కర్ పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో..

జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ జీవనజ్యోతి మాట్లాడుతూ పూలే సామాజిక విప్లవ ప్రవక్త అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, పరీక్షల విభాగం అధికారి శరవణ, అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ కో–ఆర్డినేటర్ బాబు, అధ్యాపకులు రెడ్డిబాషా, రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

పూలేకు పలువురు నివాళి

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలో శుక్రవారం మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. పీసీఆర్ సర్కిల్‌లోని పూలే విగ్రహానికి సీపీఐ నాయకులు రామనాయుడు, నాగరాజు, జనార్దన్ తదితరులు నివాళులర్పించారు. సీపీఎం నాయకులు గంగరాజు, బాలసుబ్రమణ్యం, రాజేష్‌లో పూలమాలవేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు జగదీశ్వర్‌నాయుడు, అట్లూరి శ్రీనివాసులు, షణ్ముగం, గోకుల్ కలిసి విగ్రహానికి పూలమాల వేశారు.

కార్పొరేషన్ కార్యాలయంలో..

చిత్తూరు అర్బన్ : చిత్తూరు కార్పొరేషన్ కార్యాలయంలో పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

పూలే ఆశయం జగనన్నతో సాధ్యం

చిత్తూరు కార్పొరేషన్: జ్యోతిరావు పూలే ఆశయ సాధన జగనన్నతో సాధ్యమని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం పూలే జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడారు. రాష్ట్రంలో కులాల కోసం కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వారి అభ్యున్నతికి గత ప్రభుత్వం తోడ్పాటు అందించిందన్నారు. నామినేటెడ్ పోస్టులు, పదవుల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించిందని గుర్తు చేశారు. బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి పూలే బాటలో జగనన్న పాలన అందించారన్నారు. రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానజగదీష్ మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం పూలే ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు త్యాగ, నారాయణ, నగర పార్టీ అధ్యక్షుడు కేపీ శ్రీధర్, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాయత్రీదేవి, పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు సూర్యప్రతాప్‌రెడ్డి, జెడ్పీటీసీ బాబునాయుడు, గుడిపాల పార్టీ అధ్యక్షుడు ప్రకాష్, నాయకులు కృష్ణమూర్తి, రాహుల్‌రెడ్డి, రజనీకాంత్, అంజలిరెడ్డి, అమర్‌నాథరెడ్డి, భాగ్యలక్ష్మి, రవీంద్ర రెడ్డి, వెంకటేష్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, అను, సంపత్, నౌషద్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న విజయానందరెడ్డి, చంద్రశేఖర్ నాయకులు



నివాళులర్పిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

పీడిత జన బాంధవులు పూలే

గుడిపాల: పీడిత జన బాంధవులు మహాత్మా జ్యోతిరావు పూలే అని మండల బీజేపీ సీనియర్ నాయకుడు కొల్లా చిట్టిబాబు అన్నారు. 197రామాపురంలో శుక్రవారం పూలే సేవలను స్మరిస్తూ ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మురారి సుధా, ఆనంద్, కుసుమ,కుమారి, లక్ష్మి పాల్గొన్నారు.



చిత్తూరు: పీవీకేఎన్ కళాశాలలో...



చిత్తూరు: నివాళి అర్పిస్తున్న మేయర్





గుడిపాల: మాట్లాడుతున్న నాయకులు, చిత్తూరు: పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న సీపీఐ నాయకులు

పట్టభద్రులకు సత్కారం



సత్కారం అందుకున్న విద్యార్థులతో అధ్యాపకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం అపోలో కాలేజీలో శుక్రవారం పట్టభద్రులకు సత్కారాన్ని ఘనంగా నిర్వహించారు. కాలేజీలోని 28 మంది ఎండీ, ఎంఎస్ పూర్తి చేసుకున్న వైద్యులకు జ్ఞాపికలను అందజేశారు. ఈ జ్ఞాపికలను వినోద్‌భట్ చేతుల మీదుగా వారు అందుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు అల్ఫ్రెడ్, నరేష్‌కుమార్‌రెడ్డి, రంగనాథ్, రమ్య తదితరులు పాల్గొన్నారు.



రథోత్సవంలో స్వామివారు



రాములోరి రథోత్సవం

చిత్తూరు నగరంలోని శ్రీకోదండ రామస్వామి ఆలయంలో శుక్రవారం రథోత్సవం నేత్ర పర్వంగా సాగింది. ఉదయం మూలవిరాట్‌కు ప్రత్యేకంగా అలంకరించి, ప్రత్యేక పూజాధి కార్యక్రమాలు నిర్వహించారు. శోభాయమానంగా అలంకరించిన రథంలో స్వామివారిని ఆశీనులు చేశారు. ప్రత్యేక పూజలు చేసి రథానికి పూజలు చేశారు. రామనామస్మరణ నడుమ రథోత్సవం ముందుకు కదిలింది. సాంస్కృతిక కార్యక్రమాలు, డప్పు వాయిద్యాల నడుమ రథం నగరవీధుల్లో తిరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు పట్టారు.

- కాణిపాకం